## క్లుప్తంగా

### యోగా గురువు శ్రీనివాస్‌కు ఘన సన్మానం



యోగా గురువు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న శిష్య బృందం

**మండపేట:** పట్టణానికి చెందిన యోగా గురువైన కేదారిశెట్టి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. గురుపూర్ణిమను పురస్కరించుకుని ఆదివారం స్థానిక బ్యాంక్ కాలనీలోని యోగా శిక్షణ కేంద్రంలో శ్రీనివాస్‌ను ఆయన శిష్యులు దుశ్శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా శిష్య బృందం మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా శ్రీనివాస్ అందరికీ యోగ విద్యను పంచుతున్నారని కొనియాడారు. బెంగళూరులోని స్వామి వివేకానంద యూనివర్సిటీలో పీజీ డిప్లొమా చేసిన శ్రీనివాస్ తనకు తెలిసిన విద్యను పదిమందికీ ఉపయోగపడేలా అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఉప్పలపాటి రామభద్రిరాజు (వర్మ), కంది అప్పారావు, దుగ్గన శ్రీనివాస్, తాడి చింతాలు, నానాజీ, రావూరి ప్రసాద్, సూర్యనారాయణరెడ్డి, బాబీ, మహిళలు పాల్గొన్నారు.

### విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



కుమార్

**మండపేట:** పట్టణ శివారు సంఘం కాలనీకి చెందిన కొండరాజు ఏసు కుమారుడైన కొండరాజు స్వామి (కుమార్) అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుమార్ ఈ నెల 18వ తేదీ ఉదయం బ్యాగ్ తీసుకుని టౌన్‌లో తాను చదువుతున్న స్కూల్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. తన బ్యాగ్‌ను స్కూల్లో ఉంచిన కుమార్ అక్కడి నుంచి తన స్నేహితుడి ఇంటికి వెళ్లి అతడిని రూ.500 ఉంటే ఇమ్మని అడిగాడు. తాను హైదరాబాద్ గానీ, గౌరీపట్నం గానీ వెళ్తున్నానని, నువ్వు కూడా వస్తావా? అని కుమార్ స్నేహితుడిని అడిగాడు. అతడు రానని చెప్పడంతో కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం అయినా కుమార్ ఇంటికి రాకపోయేసరికి అతడిని తండ్రి వెతకసాగాడు. దీనిపై తండ్రి ఏసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్ఐ శాస్త్రి తెలిపారు.

### శిథిలమైన వంతెన పరిశీలన

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని యనమదల గ్రామంలో ఇటీవల శిథిలమైన వంతెనను రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ఆదివారం పరిశీలించారు. వంతెన ఓ పక్క బాగా శిథిలం కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకున్న ఆర్డీఓ తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డీటీ కె.మహాలక్ష్మినాయుడులను వెంట పెట్టుకుని వంతెనను పరిస్థితులను స్వయంగా వచ్చి చూశారు. భారీ వాహనాలు ప్రయాణిస్తే కచ్చితంగా ప్రమాదం సంభవిస్తుందని గుర్తించి తగిన రక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశించారు. భారీ వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు. వంతెన పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్ఓ కడలి రాము, స్థానికులు పాల్గొన్నారు.

# మంత్రిగారూ.. మీరైనా పట్టించుకోరూ..

- నిర్మాణానికి నోచుకోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- పాత భవనంలో మాయమైన విలువైన కలప
- పదేళ్లుగా కాలయాపన
- మంజూరైన నిధులు రూ.35 లక్షలు ఏమయ్యాయో?
- కక్షిదారులకు తీరని ఇబ్బందులు



పట్టణంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో శిథిలమైన సబ్ రిజిస్ట్రార్ పాత కార్యాలయం

**రామచంద్రపురం:** దశాబ్దకాలం గడుస్తున్న శిథిలమైన భవనానికి మాత్రం మోక్షం లభించలేదు. అప్పట్లో అమాత్యుల వారు జాలిపడి మంజూరు చేసిన నిధులు ఏమయ్యాయో ఎవరికి తెలియదు. శిథిలమైన రిజిస్ట్రార్ కార్యాలయంలో విలువైన కలప అక్రమార్కుల పాలవుతున్న ఆశాఖాధికారులకు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లే ఉంది. రామచంద్రపురం పట్టణంలోని ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ కథ.. గత పదేళ్లుగా సాగుతూనే ఉంది. అప్పట్లో నిధులు మంజూరైనా భవన నిర్మాణం ఎందుకు సాగటం లేదు.... ఎవరు అడ్డంకులు పెడుతున్నారు... ఇవన్నీ తెలియాలంటే ప్రస్తుతం నియోజకవర్గ అమాత్యులు కాస్త దృష్టి సారించాలని కక్షిదారులు కోరుతున్నారు. అసలు ఈ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం కథా కమామీషు తెలుసుకుందాం.

పట్టణంలోని ప్రధాన రహదారిని అనుకుని డీఎస్పీ కార్యాలయం పక్కన గల సొంత స్థలంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండేది. పురాతన భవనం కావటంతో శిథిలావస్థకు చేరుకోవటంతో అక్కడ నుంచి 2003లో రాజగోపాల్ సెంటర్‌లోని ఒక ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకుని అందులో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొంతకాలం వరకు కార్యాలయం ఇక్కడే కొనసాగగా, తిరిగి శీలంవారి సావరం రోడ్డులో మరో భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి నేటి వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. నియోజకవర్గంలోని రామచంద్రపురం అర్బన్, రూరల్‌తో పాటు మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లోని సుమారు మూడు మండలాలకు చెందిన ప్రజలకు ఈ కార్యాలయం నుంచే సేవలందుతున్నాయి. రిజిస్ట్రేషన్‌ల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నా కక్షిదారులకు మాత్రం సరైన రిజిస్ట్రార్ కార్యాలయం లేకుండా పోయింది. సొంత స్థలం ఉన్నప్పటికీ గత పదేళ్లుగా ప్రభుత్వ సొమ్ములతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఎంతో విలువైన డాక్యుమెంట్‌లు ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రతిసారి మార్చటం వలన చాలా ఇబ్బందులను ఎదుర్కొనటమే కాకుండా అప్పట్లో అద్దె భవనంలోకి మార్చే సమయంలో రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన కొన్ని విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయాయనే అనుమానాలు కూడా ఆనాడు బయటకు వచ్చాయి. ఇదిలా ఉండగా 2012 జరిగిన ఉప ఎన్నికల్లో తోట త్రిమూర్తులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి తోట నరసింహం 2013లో నియోజకవర్గానికి వచ్చిన సమయంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు అభ్యర్థన మేరకు శిథిలమైన రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా కనీసం భవన నిర్మాణానికి ప్లాన్ కూడా వేయలేకపోయారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన అనంతరం 2014లో పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలను వేసేందుకు అధికారులు వచ్చినా అప్పటి నుంచి ముందుకు కదల్లేదు. పాత బస్టాండ్‌కు దగ్గరలో ప్రధాన రహదారిని అనుకుని పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తొలగించేందుకు గతంలో సీల్డ్ టెండర్‌ను అధికారులు ఆహ్వానించారు. కానీ అప్పట్లో జిల్లా రిజిస్ట్రార్ అర్ధాంతరంగా వేలం నిలిపివేశారు. వేలం నిలిపివేసి దాదాపుగా పదేళ్లు గడుస్తున్న తిరిగి వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టలేదు. అటు పాత భవనం తొలగించేందుకు వేలం నిర్వహించకపోవటంతో పాటుగా నూతన భవన నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఇదిలా ఉండగా పాత రిజిస్ట్రార్ భవనం పూర్తిగా శిథిలమై అందులోని రూ.లక్షల విలువైన కలప ఇప్పటికే అక్రమార్కుల పాలయిందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ కాస్త చొరవ చూపి దృష్టి పెట్టాలని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు, కక్షిదారులు కోరుతున్నారు.

### శాకంబరిగా దర్శనమిచ్చిన సత్తెమ్మతల్లి



వెదురుపాకలో శాకంబరిగా దర్శనమిచ్చిన సత్తెమ్మ అమ్మవారు

**రాయవరం:** మండలంలోని వెదురుపాక-ఆరికరేవుల రహదారిపై కొలువైన శ్రీసత్తెమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకుడు మాచవరపు వెంకట సురేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. కాకి సత్యసాయి మణికంఠ అనే కూరగాయల వ్యాపారి 25 రకాల కూరగాయలను అమ్మవారి అలంకరణకు వితరణగా సమర్పించారు.

# బాధిత రైతులను ఆదుకోవాలి



కోలంకలో పంటపొలాలను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేస్తున్న రాజబాబు, రైతు సంఘాల నాయకులు

**కాజులూరు:** భారీ వర్షాల కారణంగా మండల గ్రామాల్లో పంటపొలాలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తగిన రీతిలో ఆదుకోవాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. రాజబాబు తదితర రైతు సంఘాల నాయకులు ఆదివారం మండలంలోని కోలంక, పల్లిపాలెం, ఉప్పుమిల్లి తదితర గ్రామాల్లో బాధిత రైతులను పరామర్శించి నష్ట పరిహారాలకై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ 18,500 ఎకరాల సాగుభూమి ఉండగా ఇప్పటి వరకూ సుమారు 11,500 ఎకరాల్లో రైతులు వెదచల్లికు, నారుమడులు చల్లుకున్నారన్నారు. భారీ వర్షాలకు గత వారం రోజులుగా పంట నీట మునిగి ఉండటంతో మొలకెత్తిన వరి మొక్క చనిపోయి పూర్తిగా నష్టం వాటిల్లుతుందన్నారు. మరలా నారుమడులు చల్లుకునేందుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఏటిగట్టును పరిశీలించిన ఆర్డీఓ

**కె.గంగవరం:** గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఆదివారం రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ పరిశీంచారు. సుందరపల్లి, కూళ్ల గ్రామాల్లో ఉన్న ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా బలహీనంగా ఉన్న చోట్ల వెంటనే ఇసుక బస్తాలను ఉంచాలని కోరారు. సుందరపల్లి వద్ద మరింత బలహీనంగా ఉన్న గట్టుకు 9 వేల ఇసుక బస్తాలు ఉంచామని చెప్పారు. ఏటిగట్టు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి మరింత వరద నీరు వచ్చే చేరే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది గట్టు వెంబడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏటిగట్టు పరీవాహక గ్రామాల్లో గట్టు వద్ద పహారా నిమిత్తం పోలీసులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే పంటు ప్రయాణాన్ని నిలిపివేశామని లంకల్లో ఉన్న పశువులను రైతులు వెంటనే గట్టుకు చేర్చాలన్నారు. తహసీల్దార్ రవీంద్ర, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కె. గంగవరం మండలం సుందరపల్లి వద్ద గట్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్



కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గోదావరి గట్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

**కోరుమిల్లి ఏటిగట్టును..**

**కపిలేశ్వరపురం:** మండలంలోని కోరుమిల్లి గోదావరి గట్టును రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ ఆదివారం పరిశీలించారు. గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరి తీర ప్రాంతాన్ని ఆర్డీఓ సందర్శించారు. గతేడాది వరదల సమయంలో కోరుమిల్లి సమీపంలో గట్టు బలహీనపడడంతో తాత్కాలిక చర్యలుగా ఇసుక బస్తాలతో పటిష్ట పరిచారు. అదే పరిస్థితి నేడూ కొనసాగుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ప్రమాదమూ లేదని నిర్ధారణకు వచ్చారు. క్షేత్ర స్థాయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఆదేశించారు.

# నిత్య ధ్యానంతో ఆత్మ సంతృప్తి

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- తాపేశ్వరంలో ఆధ్యాత్మిక శిబిరం



అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న విజయభాస్కరరెడ్డి దంపతులు

**మండపేట:** రోజూ కొద్దిసేపు ధ్యానం చేస్తే ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా తాపేశ్వరంలోని అతిథి ఫంక్షన్ హాల్లో ఆధ్యాత్మిక శిబిరం నిర్వహించారు. పిరమిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. విశ్వ సంతోషి పిరమిడ్ ధ్యాన ఆశ్రమం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జీవితంలో గురువు ఉండాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జీవితమే అందరికీ పెద్ద గురువు అని, జీవితమే మనకు అన్ని పాఠాలూ నేర్పుతుందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కవి యర్రాప్రగడ రామకృష్ణ (రాజమహేంద్రవరం) మాట్లాడుతూ సాత్వికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. మహా గురువు పత్రీజీ మన ముందు లేకపోయినప్పటికీ ఆయన మనకు అందించిన శ్వాసమీద ధ్యాస అనే ఆధ్యాత్మిక మాధుర్యాన్ని దేశంలోని ప్రతి ఒక్కరికీ అందించాలని కోరారు. ముఖ్య అతిథులను విజయభాస్కరరెడ్డి దంపతులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.అనంతరం వేద పఠనం, సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి.

### అధైర్యపడొద్దు.. క్షేమంగా తీసుకువస్తాం

**అంబాజీపేట:** ఏజెంటు చేసిన మోసం వల్ల సౌదీ అరేబియాలో అష్టకష్టాలు పడుతున్న యువకుడ్ని భారత రాయబారి కార్యాలయం ద్వారా తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ చెప్పారు. ఇసుకపూడి శివారు మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ మధ్యవర్తి, ఏజెంట్ల ద్వారా ఖతార్‌కు బదులు సౌదీ అరేబియా వెళ్లి మోసపోయిన విషయం తెలిసిందే. కోనసీమ జిల్లా కలెక్టర్ వి.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్డీవో వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను ఆదివారం కలసి మనోధైర్యం కల్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ వీరేంద్రకుమార్ కథనం సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయ్యారన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కేంద్ర రాయబార కార్యాలయాన్ని సంప్రదించిందని త్వరలో వీరేంద్రకుమార్‌ను క్షేమంగా తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మీరెవ్వరూ అధైర్యపడొద్దని వీరేంద్రకుమార్ తల్లిదండ్రులు సత్తిరాజు, మరియమ్మ, సోదరుడు రవికుమార్‌లకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, తహసీల్దార్ జె.వి మలకుమారి, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### 'కూర్మ'లత..



వర్షాకాలం కావడంతో దొంకలన్నీ తీగలతో అల్లుకుంటూ వివిధ రకాల ఆకృతులు ఏర్పడుతున్నాయి. మండపేట-కాకినాడ ప్రధాన రహదారిపై చెట్లపై అల్లుకున్న తీగలతో తాబేలు ఆకారాన్ని సంతరించుకుంది. రహదారి వెంబడి ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులు తాబేలు ఆకృతిలో ఉన్న ఈ దృశ్యం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది.

-రాయవరం

# జ్ఞాన మార్గాన నడిపే వ్యక్తి గురువు

- వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్
- ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**రాయవరం:** మనలో ఉన్న అజ్ఞానమనే తిమిరాన్ని పారదోలి, జ్ఞానజ్యోతిని వెలిగించి మంచి మార్గంలో నడిపించే విశిష్టమైన వ్యక్తే గురువని, వ్యాస మహాముని కాలం నుంచి గురు పరంపర కొనసాగుతోందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాజరైన భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పురాణేతిహాస కాలం నుంచి నేటి వరకూ సమాజంలో గురుస్థానం పదిలంగా ఉందన్నారు. వ్యాసుడు జన్మదినాన్ని, వేదం నాలుగు భాగాలుగా విభజించబడిన రోజును గురు పౌర్ణమిగా జరుపుకోవడం అనాదిగా వస్తోందన్నారు.

**భక్తులతో కిటకిటలాడిన పీఠం..**

గురుపౌర్ణమిని పురస్కరించుకుని పీఠం భక్తులతో కిటకిటలాడింది. పీఠంలోని విజయదుర్గా అమ్మవారిని సుందరంగా అలంకరించిన వేదపండితులు చీమలకొండ శ్రీనివాస్, చక్రవర్తుల మాధవాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆదిశంకరాచార్యులు, శృంగేరి పీఠాధిపతి అభినవ విద్యాభారతి, భారతీ తీర్థస్వామి వార్ల పాద పద్మాలకు పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు గాడ్‌ను పూలాంకృతులను చేసి ఆయనకు పాద పూజ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. గురుపౌర్ణమి పూజల్లో పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**వాడవాడలా..**

కాగా మండలంలో వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పసలపూడి బస్టాండ్ సెంటర్‌లోని షిర్డిసాయిబాబా ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. పసలపూడి, చెల్లూరు, వెంటూరు, రామచంద్రపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

**కాజులూరు:** మండల గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వేకువ జాము నుంచి భక్తులు సాయిబాబా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి, పెనుమళ్ల, అయితపూడి, చేదువాడ, కాజులూరు, శీల, ఉప్పుమిల్లి గ్రామాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. భక్తులు బాబావారికి పంచామృతాభిషేకం, విష్ణు సహస్ర సామూహిక పారాయణ, అష్టోత్తర విభూది పూజలు చేసి అభిషేకాలు, ప్రత్యేకహారతులు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలు జరిపారు.

**కె.గంగవరంలో..**

**కె.గంగవరం:** మండలంలోని పాణింగపల్లి, పామర్రు, సత్యవాడ, కోటిపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పాణింగపల్లిలోని సాయిబాబా ఆలయం వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, క్షీరాభిషేం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా సత్యవాడలోని సాయిబాబా ఆలయం వద్ద గ్రామానికి చెందిన మాకినీడి బ్రహ్మయ్య, వెంటకరమణ దంపతుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి మహిళా భక్తులు భజనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

**ద్రాక్షారామలో..**

**రామచంద్రపురం రూరల్:** మండలంలో గురుపూర్ణిమ పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పలు దేవాలయాలతో పాటు షిరిడీ సాయిబాబా ఆలయాల్లో బాబా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హసన్‌బాద షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, హారతులు, సాయి సత్యవ్రతాలు జరిగాయి. షిరిడీ సాయి సేవాశ్రమం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సుమారు 50 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ భీమ షిరిడీ సాయి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సత్తి సుబ్బారెడ్డి, అధ్యక్షుడు పోతంశెట్టి రాంబాబు, కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి పేపకాయల కృష్ణ, సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు.

**మండపేటలో..**

**మండపేట:** గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బురుగుంట చెరువు సీతారామ క్షేత్రంలో కొలువైన సాయిబాబా ఆలయంలోను, తరవాణీపేట వీధిలోని సాయినాథుని ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సీతారామ క్షేత్రంలో సాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ క్షేత్రం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు) సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు, వృద్ధులు, సాయిబాబా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మల్లిపూడి గణేశ్వరరావు, పసల కొండ, మెర్ల పుల్లయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం:** మండలంలోని గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అంగర, నల్లూరు, కాలేరు, కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక తదితర గ్రామాల్లోని షిర్డి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో బాబాను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక హారతులిచ్చారు. అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబా కీర్తనలను ఆలపించారు.



పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



సాయినాథుని సేవలో మండపేట చైర్‌పర్సన్ దుర్గారాణి



ఆర్యావటం బాబావారి ఆలయం వద్ద కాకినాడ-కోటిపల్లి రహదారిపై బారులు తీరిన భక్తులు



ద్రాక్షారామ షిరిడీ సాయి ఆలయంలో..



సత్యవాడలోని సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



పీఠంలో గురుపూజ చేస్తున్న వేద పండితులు

### నిత్యాన్నదాన పథకానికి రూ.11,116 విరాళం

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చిన్ని శ్రీనివాసరావు ఆదివారం రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును అర్చకులకు అందజేశారు. దాతను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.